సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 18 । జనవరి । 2025



మెరుగైన సేవలందించండి

విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య సూచించారు. -IIలో



బెరైటీస్‌ను కొల్లగొడుతున్న టీడీపీ నేతలు

పులివెందుల నియోజకవర్గంలోని టిఫిన్ బెరైటీస్‌ను టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారని వేల్పుల రామలింగారెడ్డి అన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
29.0/18.6

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 18.6 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.


-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పీఎం విశ్వకర్మ శిక్షణ పొందిన వారికి రుణాలు

కడప కార్పొరేషన్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద శిక్షణ పొందిన నిరుద్యోగులకు ప్రతి శుక్రవారం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బ్యాంకు మేనేజర్లను సంప్రదించి రుణాలు మంజూరు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

రేపు వేమన జయంతి



కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ)పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'ప్రజాకవి'వేమన జయంతిని ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, సభాధ్యక్షులుగా వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రధానవక్తగా 'శతావధాని'ఆముదాల మురళి (తిరుపతి) పాల్గొంటారన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు ఎస్.నాగముని (మధుబాబు) వేమన పద్య పఠనం చేయనున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు డీఎస్పీగా భావన



భావన

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు డీఎస్పీగా పూతి భావన నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ డీజీపీ తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొద్దుటూరులో డీఎస్పీగా పని చేస్తున్న భక్తవత్సలంను హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 ఫలితాల్లో పూతి భావన టాపర్‌గా నిలిచి డీఎస్పీగా ఎంపికయ్యారు. 2022 బ్యాచ్‌కు చెందిన భావన స్వస్థలం విశాఖపట్టణం. ట్రైనింగ్ అనంతరం ఆమెను ప్రొద్దుటూరు డీఎస్పీగా నియమించారు. 2017లో అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో భావన బీటెక్ పూర్తి చేశారు. తర్వాత ఒక సంవత్సరం పాటు పూణెలో డేటా ఎనలిస్టుగా పని చేశారు. మూడేళ్ల పాటు గ్రూప్–1 పరీక్షల కోసం సాధన చేసి విజయం సాధించారు. రెండు, మూడు రోజుల్లో భావన ప్రొద్దుటూరు డీఎస్పీగా చార్జ్ తీసుకోనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

6న చలో శ్రీకాకుళం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలు శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు జరుగుతాయని అఖిల భారతీయ యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, గంగా సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం రా.రా. గ్రంథాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఫిబ్రవరి 6న భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని, రాష్ట్రం నలుమూలల నుంచి యువత నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు కావస్తున్నా ఖాళీ ఉద్యోగాల గురించి ఇప్పటివరకు ఒక్క ప్రకటన కూడా చేయలేదన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఉంటుందని చెప్పి ఇప్పటివరకు ఏయే శాఖలలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారన్న విషయం ప్రకటించకుండా జాబ్ క్యాలెండర్ ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నాగార్జున , శివ, చంద్ర, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండుతలల గొర్రె పిల్ల




గొర్రె పిల్లతో యజమానులు

జమ్మలమడుగు: వైఎస్సార్‌జిల్లా జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని గుడ్ల నాగేష్ అనే వ్యక్తి గొర్రెలు, మేకలను పెంచుకుంటున్నారు. ఇతని ఇంట్లో రెండుతలలు, మూడు కన్నులు, మూడు కాళ్లతో గొర్రె పిల్ల జన్మించింది. శుక్రవారం ఓ గొర్రె వింత పిల్లకు జన్మనివ్వడంతో గ్రామంలో చాలా మంది దీనిని చూడటానికి వెళ్లారు. ఈ విషయం గురించి వెటర్నరీ అధికారులతో మాట్లాడగా జన్యులోపం వల్ల ఇలా జరుగుతుందని చెబుతున్నారు.

గాలిలో హామీలు ▸ అక్రమాలు కోకొల్లలు

- చంద్రన్నా.. ఏమున్నది...గర్వకారణం!
- జిల్లాలో రాజ్యమేలుతున్న శాండ్..ల్యాండ్ మాఫియా
- అక్రమ ఆదాయం కోసం అర్రులు చాస్తున్న తెలుగుతమ్ముళ్లు
- కడప, కమలాపురాల్లో విచ్చలవిడిగా గ్రావెల్...ఇసుక దందా
- ఎన్నికల హామీల అమల్లో కన్పించని స్పష్టత
- ఉక్కు పరిశ్రమ మాటే కానీ, చిత్తశుద్ధి ఏదీ?





నానాపల్లె సమీపంలోని కాలభైరవ గుడి వద్ద కొండను తవ్వేసిన అక్రమార్కులు (ఇన్‌సెట్) గ్రావెల్ లోడ్‌తో తరలివెళ్తున్న టిప్పర్

సాక్షి ప్రతినిధి, కడప: నేను రాయలసీమ బిడ్డనే. ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి నోటి నుంచి టక్కున వస్తున్న మాట ఇది. చెప్పుకోవడం మినహా ప్రాంతం పట్ల ప్రత్యేక శ్రద్ధ అటుంచితే వివక్ష చూపుతున్నారు. అత్యధిక కాలం అధికారంలో ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రులు చూపెట్టిన శ్రద్ధ ఏనాడు కన్పించలేదు. ఏడు నెలలల చంద్రన్న సర్కార్‌లో కడప గడ్డపై నిర్లక్ష్యపు నీడ తాండవం చేస్తోంది. నూతన పరిశ్రమలు రాకపోగా ఎంఎస్ఎంఈ తరలించుకపోయారు. మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయకుండా తిరస్కరించారు. ప్రభుత్వ పెద్దగా చంద్రబాబు వైఖరి అలా ఉంటే ప్రకృతి సంపద ఆధారంగా ల్యాండ్..శాండ్ మాఫియా అవతారమెత్తిన తెలుగుతమ్ముళ్లు దోపిడీకి పాల్పడుతున్నారు.

- చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి కానీ, ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలనే తపన ఆలోచన కన్పించదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. చివరకు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కూడా సాగునీరు అందించేందుకు మనస్సు రాలేదు. నేనూ సీమ బిడ్డనే అంటూ రంకెలేసే చంద్రబాబు...సీమకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కొనసాగించలేని దుస్థితిలో ఉన్నారు. రూ.530 కోట్లతో పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మిస్తే నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లను సైతం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ తిరస్కరించింది.

హామీలు నీటి బుడగలే...

ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు జిల్లాలో సత్వరమే ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చిన ఉక్కు పరిశ్రమ ఊసే లేదు. ఎన్నికల సమయంలో ఉక్కుపరిశ్రమపై ఉత్తిత్తి మాటలు తెరపైకి వస్తాయి, కానీ ఆచరణలో చిత్తశుద్ధి కన్పించదు. అనేక సార్లు రైతుల పంటలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తాం. బిందు సేద్యం నిర్వహణకు 90 శాతం సబ్సిడీ ఇస్తాం. రాయలసీమకు సాగునీటి సమస్యను తీరుస్తాం... అవే మాటలు ఇప్పటికీ రీపిట్ అవుతున్నాయి. టూరిజం సర్క్యూట్, హార్టికల్చర్ హబ్ కలగానే మిగిలిపోయిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. జీఎన్ఎస్ఎస్ పథకం తొలిదశలో సాగునీటి రిజర్వాయర్లు నిర్మించారు. ఆయకట్టుకు అనువుగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు చేయాలనే తలంపే లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణలు లేకపోలేదు. మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, కడప నియోజకవర్గాలకు ప్రాణప్రథమైన రాజోలి రిజర్వాయర్ ఊసేలేదని జిల్లా వాసులు వాపోతున్నారు.

» దోపిడీలో తలమునకలైన తెలుగుతమ్ముళ్లు...

ప్రకృతి సంపద తెలుగుతమ్ముళ్ల పాలిట కల్పతరువుగా మారింది. నదులు గుల్ల అవుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక లూటీ చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం ఒకరిపై మరొకరు పోటీ పడుతున్నారు. చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. పొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈతంతు కమలాపురం, జమ్మలమడుగు, రాజంపేటల్లో అత్యధికంగా తెరపైకి వస్తోంది. కడప చుట్టు పక్కల కొండలను పిండి చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించుకుపోతున్నారు. కడప పరిసర ప్రాంత మండలాలైన చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రిలలో గ్రావెల్ ఖాళీ చేశారు. కొండలన్నీ గుల్ల అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కోట్లాది విలువైన భూములకు తెలుగుతమ్ముళ్లు యజమానులుగా మారిపోతున్నారు. ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. అడ్మినిస్ట్రేటర్‌గా గుర్తింపు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈమారు పేరు కూడా గాలిలో కలిసిపోతున్నట్లు పలువురు వివరిస్తున్నారు. అందుకు 70రోజులుగా జిల్లాలో ఎస్పీగా ఇన్‌చార్జి అధికారి పోస్టింగ్‌లో ఉండడం కూడా పలువురు చెప్పుకొస్తుండడం విశేషం.

ఎంఎస్ఎంఈ తరలింపు

రాష్ట్ర ప్రజలందరికీ పాలకుడైనా, ఇక్కడి ప్రజల పట్ల ఛీత్కారం ఆయన హయాంలో ఎప్పుడూ తెరపైకి వస్తూనే ఉంది. మునుపంతా ఓట్లు–సీట్లు ఇవ్వలేదు, మీకేందుకు పనులు చేయాలంటూ సీఎం హోదాలో బాహాటంగా వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు తాజాగా ఓట్లు–సీట్లు లభించినా అదే వివక్ష చూపుతున్నారు. క్రమం తప్పకుండా కడప అంటే కడవు మంట ప్రదర్శిస్తున్నారు. భారత ప్రభుత్వం కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.250 కోట్లతో మంజూరు చేసిన రెండో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సైతం అమరావతికి తరలించారు. వెనుకబడిన జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈని అభివృద్ధి చెందిన అమరావతికి తరలించుకుపోయారు. సీఎంగా చంద్రబాబు ఎప్పుడు బాధ్యతలు చేపట్టినా జిల్లాకు అన్యాయం చేస్తున్నారని విశ్లేషకులు ఎత్తిచూపుతున్నారు. 2014–19లో కూడా కడపకు మంజూరైన ఉర్దూ యూనివర్సిటీని సైతం కర్నూలుకు తరలించారు. తాజాగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీసు తరలింపునకు రంగం సిద్ధం చేశారు. గ్రామీణ బ్యాంకుల పునర్‌వ్యవస్థీకరణ పేరుతో ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యారని విశ్లేషకులు వాపోతున్నారు.

నేడు సీఎం చంద్రబాబు జిల్లాకు రాక



కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు వస్తున్నారు. ఆయన మైదుకూరులో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసింది. అధికారిక సమచారాం మేరకు సీఎం పర్యటన వివరాలు

- ఉదయం 10:30కు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 11.05 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు
- విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి 11.50 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12 గంటలకు కడప ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి 12.10 గంటలకు మైదుకూరులో ఏర్పాటుచేసిన హెలిపాడ్ కు చేరుకుంటారు.
- 12.20 గంటలకు కేసి కళ్యాణ మండపం చేరుకొని ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడుతారు.
- 1.50 గంటగలకు కేసీ కల్యాణ మండపం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి వినాయక నగర్ లోని మున్సిపల్ కార్మికుల ఇంటిని సందర్శిం ఇంటింటికి చెత్త సేకరణ గురించి వివరిస్తారు.
- 2.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి నేషనల్ గ్రీన్ కాప్స్‌తో కలిసి నడకతో రాయల కూడలి ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకుంటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొంటారు.
- సాయంత్రం 4: 30 నిమిషాలకు హెలిపాడ్ ప్రాంగణానికి చేరుకుని 4.40 గంటలకు కడప ఎయిర్పోర్ట్ చేరుకుంటారు.
- 4.50 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5.35 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు.
- అక్కడి నుంచి తాడేపల్లిలోని నివాసగృహానికి 6.15 గంటలకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు

మైదుకూరు: సీఎం చంద్రబాబు శనివారం మైదుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఏర్పాట్లను పరిశీలించారు. మైదుకూరు కోర్టు సముదాయం పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ . జెడ్పీఉన్నత పాఠశాల ప్రాంగణంలో సీఎం సభ, గ్యాలరీ, స్టాళ్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కాన్వాయ్ నిర్వహణపై పోలీసులతో రిహార్సల్స్ నిర్వహించారు.

మహిళా అక్షరాస్యతే లక్ష్యం



మాట్లాడుతున్న మల్లు వెంకట సుబ్బారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: మహిళా అక్షరాస్యతే లక్ష్యంగా పనిచేయాలని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు మల్లు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్సీ భవనంలో జిల్లాలోని ఎంపీడీఓలు, ఏపీఎంలకు ఉల్లాస్ కార్యక్రమంపై నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అక్షరాస్యత కోసం నమోదైన 23,170 మంది మహిళలను అక్షరాస్యులుగా చేయడమే అందరి లక్ష్యం కావాలని కోరారు. మండల స్థాయిలో వలంటరీ టీచర్లకు మంచి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఫంక్షనల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు టీసీఎస్ ఆధ్వర్యంలో 45 వీడియోల రూపంలో అభ్యాసకులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ఆర్పీ సి.రెడ్డెయ్య, వయోజన విద్య పర్యవేక్షకులు ఉమామహేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ మండల స్థాయిలో వలంటీర్లకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకులు మాధవీలత, ఈశ్వరయ్య, సోమశేఖర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు




హాకీ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ హాకీ మైదానంలో శుక్రవారం 14వ ఎల్‌జి గిరిరావు ఏపీ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన హాకీ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మైదానంలో హాకీ స్టిక్‌తో ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. హాకీ క్రీడకు మదనపల్లె పుట్టినిల్లన్నారు. ఇదే మైదానంలో హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ హాకీ క్రీడను పరిచయం చేసి క్రీడను నేర్పించడం జరిగిందని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, ఏపీ హాకీ ప్రెసిడెంట్ బి.ఎం.చాణుక్య రాజ్, టోర్నమెంట్ డైరెక్టర్ రాజశేఖర్, బి.టి.కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, పాల్గొన్నారు.

- రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హాకీ పోటీలు మొదటి రోజు హోరీగా జరిగాయి. ప్రకాశం–అనంతపురం, చిత్తూరు–విజయనగరం, కర్నూలు–శ్రీకాకుళం, తిరుపతి–పార్వతీపురం మన్యం జిల్లాల మధ్య పోటీలు సాగాయి.

పులివెందులలో ఆధిపత్య పోరు

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయులపై బీటెక్ రవి వర్గీయులు దాడి
- 79 రేషన్‌షాపులు తన వర్గీయులకే కట్టబెట్టాలని అధికారులకు హెచ్చరికలు



సాక్షి ప్రతినిధి, కడప: అధికారం ఉంది.. ఏమి చేసినా చెల్లుబాటు అవుతోందనే ధీమా ఒకరిది, అదే అధికారం మాకు ఉంది, పార్టీ కోసం కష్టపడిన శ్రేణులకు అవకాశం కల్పించాలనే సంకల్పం మరొకరిది. ఇలా పులివెందులలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది.ప్రతి అంశంలోనూ దౌర్జన్యాలకు దిగుతూ అరాచకశక్తిగా మారుతున్నాడని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి చివరికి రేషన్ షాపు డీలర్ల విషయం వరకు టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తీరు వివాదాస్పదంగా మారిపోతోంది.

- బీటెక్ రవి..ఆయన మాజీ ఎమ్మెల్సీ. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎటువంటి పదవీ లేదు. అయినా జిల్లా మొత్తం పెత్తనం చెలాయించాలంటూ ఆరాచకాలకు దిగుతున్నారు. ప్రతి అంశంలోనూ తన కండబలాన్ని చూపిస్తూ ఇతర నియోజకవర్గాల్లోనూ వేలు పెడుతూ కూటమి ప్రభుత్వానికే తలనొప్పిగా మారాడు. తాజాగా రేషన్ షాపు డీలర్ల విషయంలోనూ సొంత పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డితో తలపడ్డారు. దీంతో పులివెందులలో పరిస్థితి వేడెక్కింది. తన వర్గీయులు మాత్రమే రేషన్‌షాపు డీలర్ పరీక్షలు రాయాలని, వేరే ఎవరూ ఆ పరీక్షకు హాజరుకాకూడదంటూ బీటెక్ రవి అనుచరులు హుకుం జారీ చేశారు. కాదని పరీక్షకు హాజరైన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు ప్రకాష్‌పై దాడి చేశారు. ఆపై కిడ్నాప్‌నకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమా దేవి ధర్నాకు దిగారు. రెండు వర్గాలు పులివెందులలో యుద్ధవాతావరణాన్ని సృష్టించారు.

జిల్లా అంతటా పరకాయ ప్రవేశం...

ఇదొక్కటే కాదు, జిల్లాలో ప్రతి అంశంలోనూ బీటెక్ రవి తీరు వివాదాస్పదంగానే మారుతోందని తెలుగుతమ్ముళ్లు బాహాటంగా చెప్పుకుంటున్నారు. మొన్నటికి మొన్న నీటి సంఘాల ఎన్నికల్లో వేరే పార్టీ వారు నామినేషన్లు వేయడానికి వీల్లేదని అనుచరులతో వారిపై నేరుగా దాడికి దిగారు. వారి చేతిలోని పత్రాలను చించేసి ఏకగ్రీవం చేసుకున్నారు. అంతకు ముందు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని క్యాంటీన్లు నిర్వహించుకుంటున్న వారిని తరిమేసి విద్యార్థులకు ఇప్పటికీ క్యాంటీన్లు లేకుండా చేశారు. క్యాంటీన్లు పెట్టుకునే విషయంలో బీటెక్ రవి, రాంగోపాల్ రెడ్డి వర్గీయుల మధ్య కూడా కోల్డ్‌వార్ నడిచింది. ఇదిలా ఉంటే గురువారం రెండు ఇసుక రీచ్‌లకు టెండర్లు జరిగితే అక్కడకు వెళ్లి ఆయన అనుచరులు హల్‌చల్ చేశారు. రాజంపేట నియోజకవర్గానికి చెందిన ఇసుక రీచ్‌లో స్థానికులు ఎవరూ టెండర్ వేయకుండా వారి చేతిలో టెండర్ పత్రాలను చించేశారు. దీన్ని చిత్రీకరిస్తున్న ఇద్దరు మీడియా ప్రతినిధులను సైతం పక్కనే ఉన్న సమాచారశాఖ ఏడీ కార్యాలయంలో పెట్టి తాళం వేయడం విశేషం.

▸▸ కొరకరాని కొయ్యగా మారిన బీటెక్...

వరుస వివాదస్పద సంఘటనలతో బీటెక్ రవి టీడీపీ వర్గీయులకు కొరకరాని కొయ్యగా మారారు. కూటమిలోని జనసేన నేతలకు సమస్యాత్మకంగా వ్యవహరించారు. ఇసుక క్వారీల్లో జనసేన వారిని టెండర్లు వేయకుండా అడ్డుకోవడంతో వారు కూడా బీటెక్ తీరుపై భగ్గుమంటున్నారు. మరో ఇసుక క్వారీ విషయంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి వర్గీయులు వస్తే వారిని టెండర్లు వేయకుండా అడ్డుకున్నారు. దీంతో కడప ఎమ్మెల్యేతోనూ నేరుగా వైరం పెట్టుకున్నారు. జిల్లాలో ఎక్కడ ఏది జరిగినా తన ఆధిపత్యమే చెల్లాలంటూ బీటెక్ రవి ప్రవర్తిస్తున్న తీరు వివాదస్పదంగా మారుతోందని ఆ పార్టీ సీనియర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలో ఉన్న బార్ యజమానులను బెదిరించి వాటిని సొంతం చేసుకున్న చరిత్ర దక్కించుకున్నారు. తాజాగా పులివెందులలో 79 రేషన్‌షాపుల నియామకానికి నోటిఫికేషన్ జారీ కాగా, అవన్నీ తన వర్గీయులకే కట్టబెట్టాలని రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. సింహాద్రిపురంలో 11 రేషన్‌షాపులకు నోటిఫికేషన్ జారీ కాగా, ఒక్కటంటే ఒక్కటి కూడా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సిఫార్సు చేసిన్ోళ్లకు దక్కేందుకు అవకాశమే ఇవ్వద్దని గట్టిగా పట్టు బట్టినట్లు సమాచారం. ఆమేరకు ప్రత్యక్షంగా బెదిరించి ఇతరులెవ్వరూ దరఖాస్తు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు ప్రకాష్‌పై కూడా దాడి చేసినట్లు సమాచారం. ఇలాంటి అరాచకాలు గతంలో ఏనాడూ జిల్లాలో చూడలేదని పలువురు వివరిస్తున్నారు. సొంత పార్టీ నేతలతో సైతం కయ్యానికి కాలు దువ్వడంతో టీడీపీలో ఇప్పుడు బీటెక్ రవి వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న ముందు రోజు ఈ ఘటన చోటుచేసుకోవడం మరింత చర్చకు ఆస్కారం ఏర్పడడం విశేషం.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



అంజద్‌బాషాను సత్కరిస్తున్న మహిళా నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. శుక్రవారం అంజద్‌బాషను నగర అధ్యక్షుడిగా నియమించినందుకు మహిళా నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. అనంతరం వెస్ట్ జోన్ అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంజద్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, కోఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, బండి మరియలు, రత్నకుమారి, తులశమ్మ, మల్లీశ్వరి ,భాగ్యమ్మ, శివమ్మ .సావిత్రమ్మ. శ్రీదేవి. హైమావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'నా పంటను దున్నేశారు'


బాధితుడు సిద్ధారెడ్డి

బ్రహ్మంగారిమఠం : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌ సొంత పంచాయతీ పలుగురాళ్ళపల్లె సమీపంలోని బొగ్గుల వారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయుడు శీలం సిద్దారెడ్డికి చెందిన పైరు ఉన్న భూమిని శుక్రవారం ఎర్రంపల్లెకు చెందిన సిద్దయ్య యాదవ్‌ మేకల పుల్లయ్య యాదవ్‌లు దున్నినట్లు బాధితుడు తెలిపారు. శుక్రవారం సిద్దారెడ్డి విలేకరులతో తన గోడు వెల్లబోసుకున్నాడు. పలుగురాళ్ళపల్లె పొలం సర్వే నంబర్‌ 825లో 2.50 ఎకరాలు తమ పిత్రార్జితం భూమి అని పేర్కొన్నారు. సర్వే నంబర్‌ 826లో 2 ఎకరాలు ఎర్రంపల్లెకు చెందిన లగసాని వీరయ్య దగ్గర అదే గ్రామానికి చెందిన మేకల పోలయ్య కొనుగోలు చేశాడన్నారు. దాదాపు 5 ఏళ్ల నుంచి తనకు ఉన్న భూమిలో అర్థం ఆయన భూమి ఉందంటూ.. తనపై దౌర్జన్యం చేస్తూ వస్తుంటే అడ్డుకుంటూ వస్తున్నామన్నారు. సర్వే చేయించుకోవాలని తెలిపినా వినడం లేదని, ఇప్పటికే సర్వే కోసం మేకల పుల్లయ్యకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. అయినా రాకుండా ఉన్నారన్నారు. ప్రస్తుతం తాను పంటను వేశానన్నారు. టీడీపీ అధికారంలో ఉందని, ఎమ్మెల్యే తమ్ముడు పుట్టా ఆనంద్‌ చెప్పాడని శుక్రవారం ఉదయం.. తాము లేని సమయంలో పైరు ఉన్న పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసి అడ్డుకోవడానికి తాము అక్కడికి వెళ్లేలోపు కొంత దున్నేసి వెళ్లిపోయారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పొలం ఎవరిది ఎంత వరకు అనేది సర్వే చేయించుకోవాలని సిద్దారెడ్డి కోరారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహాలు





కడప అర్బన్‌ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్‌)లో చికిత్స పొందుతున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. వారి ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్‌ ఆర్‌ఎంఓ డాక్టర్‌ శ్రీనివాసులు తెలియజేశారు.

బెరైటీస్‌ను కొల్లగొడుతున్న టీడీపీ నేతలు

- నాపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- కూటమి ప్రభుత్వంలో అరాచకాలు ఎక్కువయ్యాయి
- టిఫిన్‌ మైన్స్‌ నుంచి రూ.15 కోట్ల సరుకు చోరీ
- పార్థసారథిరెడ్డిపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి

పులివెందుల రూరల్‌ : పులివెందుల నియోజకవర్గంలోని టిఫిన్‌ బెరైటీస్‌ను టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆరు నెలల వ్యవధిలోనే అరాచకాలు ఎక్కువయ్యాయని, తనపైన అవినీతి ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలోని వైఎస్‌ జగన్‌ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, చిన్నప్ప, వరప్రసాద్‌, హాలు గంగాధరరెడ్డి, రసూల్‌, వేల్పుల గ్రామంలోని రైతులు, నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి మాట్లాడుతూ 'నిజాయితీగా బతుకుతుంటే నా మీద బురద జల్లే ప్రయత్నం చేస్తారా, నీవు మోసం చేయడం వల్లే ఏజెంట్‌గా తొలగించారు' అని టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డిపై మండి పడ్డారు. వ్యవస్థలన్నీ నాశనం చేసి దోచుకో, దాచుకో అన్న రీతిలో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. 'టిఫిన్‌ బెరైటీస్‌ ఏజెంట్‌గా పార్థసారథిరెడ్డి ఉన్నది వాస్తవమేనని, కానీ ఆయన నట్లు, బోల్టులను అమ్ముకుని మోసం చేయడం వల్లనే ఏజెంట్‌గా తప్పించి 2015లో నన్ను పెట్టారు' అని, ఎర్రగ్రుంట్ల ఖనిజ వనరుల శాఖ వారే ఏజెంట్‌గా జారీ చేసిన నియామక పత్రాన్ని మీడియాకు చూపించారు.

కోట్ల సరుకు చోరీపై ఫిర్యాదు

'ఆ తర్వాత టిఫిన్‌ కంపెనీ దివాలా తీయడంతో అప్పుల వాళ్లంతా నేషనల్‌ కంపెనీ లా ట్రిబ్యునల్‌ దృష్టికి తీసుకువెళ్లారని, అక్కడ ఆ ట్రిబ్యునల్‌ తీర్మానం చేసి ఏజెంట్‌గా వాసుదేవన్‌ను నియమించారని, వాసుదేవన్‌నే 2019లో నన్ను కేర్‌ టేకర్‌గా నియమించారు' అన్నారు. బెంగళూరుకు చెందిన ఎంబీసీ గ్రూప్‌ కంపెనీ హక్కులను పొందిందని ఆ కంపెనీ డైరెక్టర్‌ ధర్మలింగం నన్ను కేర్‌ టేకర్‌ ఏజెంట్‌గా కొనసాగించారన్నారు. అందుకు సంబంధించిన నియామక పత్రాలను మీడియాకు చూపించారు. ఈ నెల 13 ,14వ తేదీన రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువ చేసే ఖనిజాల సరుకును దొంగలించారని, అందుకు సంబంధించి కంపెనీ ఏజెంట్‌ అయినందున ఆ దొంగతనం గురించి పోలీసు అధికారులకు, మైన్స్‌ అధికారులకు, అలాగే కంపెనీ వారికి తెలియజేశానన్నారు. వాస్తవాలు తెలియకుండా ఇష్టమొచ్చినట్లు మీడియా ముందు మాట్లాడటం మంచిది కాదన్నారు. వేల్పులలో నేను రెండు మైన్సులు చేసిన మాట వాస్తవమే అని, కానీ లీజు ఉన్న మైన్స్‌లను మేము చేశామన్నారు. వేల్పులలో మైన్స్‌ యజమానులైన సుకర్‌ బాషా, విశ్వంశెట్టిలను బెదిరించి రూ.50 లక్షలు దోచుకున్నారని చెప్పడం అవాస్తవమన్నారు. అలాగే అశోక్‌ కంపెనీ వారితో రూ.30 కోట్లు తీసుకున్నానని చెప్పడం కూడా అవాస్తవమేనని, వీటిపై నేను ప్రమాణం చేయడానికి సిద్ధమన్నారు.

అధికారుల నుంచి స్పందన కరువు

మా తండ్రి మరణం ప్రమాదమని నాకు, మా కుటుంబ సభ్యులకు తెలుసు అని.. మా తండ్రిని కోడిని కోసినట్లు కోశారని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. కుటుంబంలో విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే స్వార్థపరుడు పార్థ అని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కోట్ల రూపాయలు విలువ చేసే ఖనిజాలన్నీ దొంగలించబడ్డాయని, వాటిని ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు. బెరైటీస్‌ను కాపాడేందుకు అనేక సార్లు అధికారులకు రక్షణ కల్పించాలని వినతి పత్రాలు పెట్టామని, కానీ ఎవరూ స్పందించలేదన్నారు. రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువైన సరుకును కూటమి నాయకులు రాత్రికి రాత్రే తరలించారన్నారు. ఎంబసీ గ్రూప్‌ ద్వారా ఎంత స్టాక్‌ వచ్చిందనే విషయాన్ని కూడా కోర్టుకు తెలిపామన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి

వేముల మండలంలో నేను దోచుకుని ఉంటే నా వెంట ప్రజలు ఉండేవారు కాదని, ఎప్పుడు నా వెంటే ఉంటారన్నారు. వేల్పులలో నాలుగు సార్లు సర్పంచ్‌గా గెలిచామని, ఇప్పటికీ మా గ్రామంలో నేను సూచించిన వ్యక్తి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గెలుస్తున్నారని, ఇదే నా వెంట ప్రజలు ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. వైఎస్‌ కుటుంబ సభ్యులు చాలా మంచివారని, వారి కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధమన్నారు. నెలలో 20 రోజులు కుటుంబానికి దూరంగా ఉండి పనులు చేసుకుంటున్నానని, నా టర్నోవర్‌ రూ.110 కోట్లు ఉందని, నాది తెరిచిన తెల్లని కాగితమని, ఎప్పుడైనా విచారణ చేయించుకోవచ్చని, నా వద్ద అన్నింటికీ ఆధారాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని అసంబద్ధమైన మాటలు మాట్లాడడం సరికాదని, హత్య రాజకీయాలను మానుకోవాలన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆందోళన

వైద్యం వికటించి మృతి చెందాడని బాధితుల నిరసన


మృతి చెందిన రామయ్య

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పంచాయతీ రామాయపల్లెకు చెందిన కారు రామయ్య (50) వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు రాత్రి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ కొండారెడ్డి కథనం మేరకు గురువారం అర్ధరాత్రి రామయ్యకు కడుపులో మంటగా ఉందని పోలీస్‌ స్టేషన్‌ ఎదురుగా ఉన్న డాక్టర్‌ జనార్ధనరెడ్డి ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్‌ పరీక్షించి ఇంజెక్షన్‌, మందులు ఇచ్చారు. ఇంటికి వెళ్లగానే వాంతులు రావడం, కడుపులో బాధ అధికం కావడంతో మళ్లీ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్‌ పరిశీలించి మరొక ప్రిస్క్రిప్షన్‌ రాశాడని, ఆ మందులు తీసుకొని ఇంటికి వెళ్లగా.. శరీరం నీలుక్కు పోతుండటంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తెచ్చారు. పరీక్షించిన డాక్టర్‌ రామయ్య మృతి చెందాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు.. 'నీవే చంపావంటూ' ఆందోళనకు దిగారు. దాంతో డాక్టర్‌ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆసుపత్రి ఎదుట రాత్రంతా శవాన్ని ఉంచి బంధువులు డాక్టర్‌ నిర్లక్ష్యమే రామయ్య చావుకు కారణమంటూ కేకలు వేశారు. డాక్టర్‌ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఉదయం ఎస్‌ఐ వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపుతామని, రిపోర్టు వచ్చాక కేసు నమోదు చేస్తామని వారికి నచ్చజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపారు. రామయ్యకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారు గుండెలవిసేలా రోదించారు.

22న అప్రెంటీస్‌ అభ్యర్థులు హాజరు కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : వైఎస్‌ఆర్‌ జిల్లాలో 2024–25 సంవత్సరానికి అప్రెంటీస్‌కు ఎంపికైన డీజిల్‌ మెకానిక్‌, మోటారు మెకానిక్‌, వెల్డర్‌, ఫిట్టర్‌, డ్రాఫ్ట్‌మెన్‌, సివిల్‌ అభ్యర్థులు ఈనెల 22న కర్నూలులోని జోనల్‌ ట్రైనింగ్‌ కాలేజీలో హాజరు కావాలని ఏపీఎస్‌ ఆర్టీసీ పర్సనల్‌ ఆఫీసర్‌ ఇ.ధనలక్ష్మి తెలిపారు. తమ ఒరిజినల్‌ టెన్త్‌, ఐటీఐ సర్టిఫికెట్లతోపాటు కుల ధృవీకరణ పత్రం, దివ్యాంగులైతే సంబంధిత సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌ సర్టిఫికెట్లు, బ్యాంకు అకౌంటు పాసుపుస్తకం, మూడు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు, ఆధార్‌కార్డు మూడు సెట్ల జిరాక్స్‌ కాపీలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

ఎంపికై న అభ్యర్థుల సీరియల్‌ నంబర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

డీజిల్‌ మెకానిక్‌ – 167, 149, 196, 150, 50, 166, 19, 189, 101, 24, 177, 146, 66, 35, 69, 135, 184, 145, 142, 43, 163, 107, 71, 151, 152, 178, 127, 26, 103, 170, 65, 110, 162, 123, 112, 185, 188, 38, 100, 97.

మోటారు మెకానిక్‌ – 20, 14, 30, 27, 19, 07

ఎలక్ట్రిషియన్స్‌ – 65, 85, 143, 86, 163

వెల్డర్‌ – 8, ఫిట్టర్‌ – 4, 19, 56

డ్రాఫ్ట్‌మెన్‌ సివిల్‌ – 20.

పీఠాధిపతి అక్బర్‌ బుఖారి కన్నుమూత


అక్బర్‌ బుఖారి సాహెబ్‌ (ఫైల్‌)

కడప కల్చరల్‌ : కడపకు చెందిన ఆస్థానె–యే–బుఖారియా పీఠాధిపతి అల్‌ హాజ్‌ సయ్యద్‌ షా అక్బర్‌ బుఖారి సాహెబ్‌ గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. నగరంలోని రహమతుల్లా వీధిలోగల అంజదియ మస్జిద్‌లో అసర్‌ నమాజ్‌ తర్వాత నమాజ్‌ ఏ జనాజా ప్రార్థన చేసి, అనంతరం అంత క్రియలు నిర్వహించారు. జిల్లాలోని ముస్లిం ధార్మిక పీఠాలలో సౌమ్యుడిగా, ధార్మిక వేత్తగా మంచి పేరు గల అక్బర్‌ బుఖారి మరణ విషయం తెలుసుకున్న పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ధార్మిక, ఇస్లామిక్‌ కార్యక్రమాల నిర్వహణలో ఆయన ప్రధానపాత్ర వహించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకుశాంతి కలగాలని దైవాన్ని ప్రార్థిస్తున్నామన్నారు. మత గురువులు, మౌల్వీలు, ముఫ్తీలు, ముస్లిం ప్రముఖులు, రాజకీయ నాయకులు, బుఖారియ పీఠం సభ్యులు, బంధువులు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

19న అర్చక సమాఖ్య సభ

కడప కల్చరల్‌ : ఆంధ్రప్రదేశ్‌ అర్చక సమాఖ్య రాష్ట్ర మహాసభ ఈనెల 19న ఆదివారం నంద్యాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్‌ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు ప్రతి జిల్లా నుంచి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తప్పక హాజరవుతారని, మన జిల్లాతోపాటు కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున సభ్యులు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో రాష్ట్ర వ్యాప్తంగా అర్చకుల సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించనున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు అర్చకుల కోసం సమాఖ్య ద్వారా అందించిన సేవలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి కూడా ప్రధానంగా చర్చించనున్నట్లు వివరించారు. నంద్యాలలోని మూలసాగరం శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని బీసీ, ఈబీసీ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన లబ్ధిదారులకు రాయితీ రుణాల దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ఈడీ జయసింహ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఏపీఓబీఎంఎంఎస్‌ వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

'శుభమస్తు'లో బహుమతి స్కూటీల పంపిణీ


లక్కీ డ్రాలో విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్‌ : కడప నగరంలోని శుభమస్తు షాపింగ్‌మాల్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలైన వారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. కడపకు చెందిన కొనుగోలుదారులకు డిసెంబర్‌ 31 నుంచి ఈ నెల 17 వరకు మాల్‌లో కొనుగోలు సందర్భంగా ఇచ్చిన లక్కీ డ్రా కూపన్లను లాటరీ తీసిన అనంతరం వారికి ఎలక్ట్రిక్‌ స్కూటీలు బహుమతిగా అందజేసే ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జరిగిన లక్కీ డ్రాలో కడపకు చెందిన రామకృష్ణ, నాగార్జున, గురవయ్య, నరసయ్యలు బహుమతులు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి మానస ఎండీ చిన్నపరెడ్డి, సిటీ కేబుల్‌ ఎండీ సూర్య నారాయణ, యోగివేమన యూనివర్సిటీ వీసీ కృష్ణారెడ్డి, వన్‌టౌన్‌ సీఐ రామకృష్ణ, మానస ఇన్‌ ఎండీ అనంతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ శుభమస్తు షాపింగ్‌ మాల్‌ ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు తక్కువ ధరకు అందించడంతోపాటు స్థానిక యువతలో పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి రాజీ లేకుండా వస్త్రాలను అందించడం పట్ల అభినందించారు. అనంతరం లయన్స్‌ క్లబ్‌ సభ్యులు వెంకటసుబ్బయ్య, మన్సూర్‌ అలీఖాన్‌ తదితరులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్‌ మాల్‌ మేనేజర్లు మడక వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచుకుని మెరుగైన సేవలందించండి


మాట్లాడుతున్న ఏఆర్‌ అదనపు ఎస్పీ బి.రమణయ్య


కార్యక్రమంలో పాల్గొన్న ఏఆర్‌ పోలీస్‌ సిబ్బంది

ఏఆర్‌ అదనపు ఎస్పీ బి.రమణయ్య

కడప అర్బన్‌ : విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఏ.ఆర్‌. అదనపు ఎస్పీ బి.రమణయ్య సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించే 'మొబలైజేషన్‌' కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌ నాయుడు ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం స్థానిక పోలీసు పరేడ్‌ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఆర్‌ అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌ శాఖలో చేసే ప్రతి పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. ఇతర ఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం భిన్నంగా వుంటుందన్నారు. ప్రజలు పోలీసులపై పెట్టుకున్న ఆశలు ఏమాత్రం సడలకుండా క్రమశిక్షణతో మెలగాల్సి వుంటుందన్నారు. ఏఆర్‌ సిబ్బందికి ప్రతి ఏటా మొబలైజేషన్‌ను నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్‌ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంతేగాకుండా ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలిచ్చిన విధంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. బి.డి.టీం, ప్రిజనర్స్‌, ఎస్కార్ట్‌, పి.ఎస్‌.ఓలు, డ్రైవర్లు, తదితర సిబ్బంది బాగా మెరుగు పరుచుకోవాలన్నారు. ఫైరింగ్‌, డ్రిల్‌, కవాతు, మాబ్‌ కంట్రోల్‌, ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు సమర్థవంతంగా నిర్వహించేలా తర్ఫీదునిస్తారన్నారు. ఇదే సమయంలో మొబలైజేషన్‌కు వచ్చిన సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సమస్యలపై కూడా దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్‌, శివరాముడు, వీరేష్‌, టైటాస్‌, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు లారీల దగ్ధం


ఎర్రగుంట్ల : మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


ముద్దనూరు : కాలిపోయిన లారీ ముందు భాగం

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గంలో శుక్రవారం విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో రెండు లారీలు దగ్ధమయ్యాయి. ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలంకూరు–ఆర్టీపీపీకి వెళ్లే మార్గన విద్యుత్‌ తీగలు తగలి లారీ కాలి బూడిద అయిన సంఘటన చోటు చేసుకుంది. చిలంకూరు వైపు నుంచి కలమల్లకు లారీ పోతుండగా.. రోడ్డుకు అడ్డంగా గేదెలు వచ్చాయి. దీంతో డ్రైవర్‌ లారీని పక్కకు మళ్లిస్తుండగా.. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌ లైన్‌ తీగలు తగిలాయి. దీంతో లారీలో మంటలు చెలరేగాయి. లారీ, టైర్లు కాలిపోయాయి. దారిలో అటుగా వెళ్తున్న స్థానికులు సమాచారం ఇవ్వడంతో.. ఆర్టీపీపీ, కమలాపురం నుంచి వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చారు. లారీలోని మంటలను అదుపు చేశారు. అయితే లారీలోని డ్రైవర్‌, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

రూ.12 లక్షల నష్టం

ముద్దనూరు : ముద్దనూరు–పులివెందుల రహదారిలో పెద్దదుద్యాల గ్రామ సమీపంలో శుక్రవారం ఓ మినీ లారీ దగ్ధమైంది. అనంతపురం జిల్లా నాయనపల్లె నుంచి పులివెందులకు వెళ్లి కూరగాయలు అన్‌లోడ్‌ చేసి లారీ తిరిగి వస్తోంది. ఘాట్‌ రోడ్డు దిగిన తర్వాత లారీ క్యాబిన్‌లో షార్ట్‌ సర్క్యూట్‌ సంభవించింది. దీంతో లారీలో మంటలు వ్యాపించి పాక్షికంగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

19న జిల్లా సమగ్రాభివృద్ధి ప్రణాళిక సదస్సు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగరంలోని రామకృష్ణ నగర్‌లో ఈ నెల 19న నిర్వహించే జిల్లా సమగ్రాభివృద్ధి–ప్రజా ప్రణాళిక అనే అంశంపై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్‌.బాబురావు , రాయలసీమ గ్రాడ్యుయేట్స్‌ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌.ఎం.గేయానంద్‌ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజల అనుకూల మేధావులు, విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. జిల్లాలోని బ్రహ్మంసాగర్‌, వెలుగొండ సర్వరాయసాగర్‌ రిజర్వాయర్లు పూర్తి అయ్యి దశాబ్దాలు గడుస్తున్నా.. వాటి కింద పంట కాలువలు, పిల్ల కాలువలు పూర్తి కాకపోవడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదన్నారు. వెంటనే రూ.10 వేల కోట్లు విడుదల చేసి పనులు పూర్తి చేయాలన్నారు. కే.సీ. కెనాల్‌ స్థిరీకరణకు గుండ్రేవుల జర్వాయర్‌ పూర్తి చేయాలని, రాజోలి లిఫ్ట్‌ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్‌ చేశారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కొప్పర్తి ఇండస్ట్రియల్‌ కారిడార్‌, స్కిల్‌ డెవలప్మెంట్‌ సెంటర్‌, ట్రిపుల్‌ ఐటీ ప్రిన్సిపల్‌ సెంటర్‌ను అమరావతికి తరలించే ప్రయత్నం విరమించుకోవాలరు. లేకపోతే భవిష్యత్తులో ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్‌, బి.మనోహర్‌, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీజీఈఏ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌

కడప రూరల్‌ : కడప నగరంలోని జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘురామ నాయుడు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం


ప్రేమ్‌సాగర్‌

కడప ఎడ్యుకేషన్‌ : అఖిల భారత అంతర్‌ విశ్వ విద్యాలయాల పురుషుల వెయిట్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌లో వైవీయూకు కాంస్య పతకం లభించింది. యోగివేమన క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయాయ విద్య విభాగ అధిపతి కొవ్వూరు రామసుబ్బారెడ్డి శుక్రవారం క్రీడాకారుడిని అభినందించి, వివరాలు వెల్లడించారు. జలందర్‌లో జనవరి 15 నుంచి 21వ తేదీ వరకు యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలలో యోగివేమన విశ్వ విద్యాలయ చాంపియన్‌ లిఫ్టర్‌ పోటీలలో దేవరకొండ ప్రేమ్‌సాగర్‌ 81 కేజీల విభాగంలో సత్తా చాటి వేమన విశ్వ విద్యాలయానికి కాంస్య పతకం సాధించి పెట్టారని తెలిపారు. ఈ క్రీడాకారుడు సీఎస్‌ఎస్‌ఆర్‌, ఎస్‌ఆర్‌ఆర్‌ఎస్‌ డిగ్రీ కళాశాలల్లో విద్యను అభ్యసించారని చెప్పారు. ఈయన స్నాచ్‌నందు 140 కేజీలు, క్లీన్‌ అండ్‌ జర్క్‌స్థాయిలో 166 కేజీల బరువును ఎత్తి మొత్తం 306 కేజీలతో జాతీయ స్థాయిలో బ్రాంజ్‌ మెడల్‌ సాధించాడని చెప్పారు. ఇదే క్రీడాకారుడు దక్షిణ, పశ్చిమ మండల విశ్వ విద్యాలయాల పోటీలలో విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించి అఖిల భారత అంతర్‌ విశ్వ విద్యాలయాల పోటీలకు అర్హత సాధించాడన్నారు. ఈ సందర్భంగా వైవీయూ ఉపకులపతి, క్రీడాబోర్డు చైర్మన్‌ అచార్య కృష్ణారెడ్డి క్రీడాకారుడిని అభినందించి రాబోయే ఖేలో ఇండియా పోటీలకు వైవీయూ తరపున భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. వైవీయూ కులసచివులు ఆచార్య పుత్తపద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డిలు క్రీడాబోర్డు, శిక్షకులు, టీమ్‌ మేనేజర్‌ ప్రసాద్‌రెడ్డిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి


రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

కడప ఎడ్యుకేషన్‌ : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న ఏపీ సబ్‌ జూనియర్‌ హాకీ బాలుర చాంపియన్‌ షిప్‌ రాష్ట్ర స్థాయి పోటీలకు వైఎస్‌ఆర్‌ జిల్లా జట్టు పయనమైంది. కడప నగరంలోని వైఎస్సార్‌ ఇండో స్టేడియంలో జిల్లా బాలుర జట్టుకు జిల్లా హాకీ అసోసియేషన్‌ కార్యదర్శి ఎం.శేఖర్‌ క్రీడా దుస్తులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో హ్యాట్రిక్‌ విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అలాగే డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, చైర్మన్‌ శ్రీనివాసులు, ప్రెసిడెంట్‌ రవిచంద్ర, ప్రవీణ్‌కిరణ్‌, సీనియర్‌ క్రీడాకారులు శ్యాముల్‌, సందీప్‌రాజు వారికి అభినందనలు తెలిపారు.

జెండర్ ఈక్వాలిటీ



ఇంటింటా లక్ష్మీకళ


ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడిపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పది హేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లినట్లే. అయితే కథ అక్కడితో ముగిసిపోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు.

ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడబిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్, సాక్షి ప్రతినిధి కరీంనగర్

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా


డాక్టర్ చెన్నమనేని పద్మ


పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ, విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త









● నగధగలు

ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!

ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.




జియా నస్రీన్ జెమాలజిస్ట్

సోషల్ మీడియా

బామ్మ కోసం...

ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!


బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్ల నీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా



కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు; టొమాటో ముక్కలు– కప్పు; వెల్లుల్లి రేకలు– 4; అల్లం తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2; జీడిపప్పు– పది పలుకులు; పాలు– అర కప్పు; మీగడ – పావు కప్పు; కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు – టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; వెన్న – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; యాలకులు – 2; లవంగం – 1; దాల్చిన చెక్క – అంగుళం ముక్క;

తయారీ: ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; పచ్చి బఠాణీ– పావు కప్పు; నీరు – 3 కప్పులు; బిర్యానీ ఆకు – ఒకటి; యాలక్కాయ – 1; లవంగం – 1; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి– 1 (నిలువుగా చీరాలి); షాజీరా– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.